అడల్ట్స్ ఓన్లీ కథ A

# రాజీ

సి. ఉమ



ఎ. సీ. ఆన్‌చేసి పల్చటి దుప్పటిని నిద్రపోతున్న సాకేత్, పావనిలమీద కప్పి డోర్‌మూసి హాల్లోకి వచ్చింది స్రవంతి. టైము తొమ్మిదిన్నర. బుధవారం కాబట్టి మహేష్ రావడానికి ఆలస్యమవుతుంది. అన్యమనస్కంగా వంటింట్లో మర్నాటి పొద్దున్న టిఫిన్‌కీ, వంటకీ కావలసినవి సరిచూసుకుంటున్న స్రవంతిని నీరసం, నిస్సత్తువ, నిస్తేజం ఆవహించాయి.

ఇపుడే కాదు..నెల రోజులుగానే జీవన స్రవంతిలా గలగలపారే ప్రవాహంలా నవ్వుతూ, ఉత్సాహంగా ఉండే స్రవంతి ప్రవాహాన్ని ఎవరో ఆపేసినట్టు నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఉంటోంది. ఏమయింది ఆ ఉత్సాహం.. ఎందు కలా అయింది?.. ఎందు కలా అవ్వాలి?.. స్రవంతి కళ్ళల్లో సన్నటి నీటిపొర.

కాలింగ్ బెల్ శబ్దం గుండెల్లో గునపం గుచ్చినట్టు విలవిలలాడించింది.

''హాయ్..పిల్లలు పడుకున్నారా, లేటయింది. నాకోసం ఎదురుచూడకుండా తినేసి పడుకో అంటే వినవు..పొద్దున్న లేస్తూనే ఇంటిపనంతా చేసి ఆఫీస్‌కి పరుగులు తియ్యాలి మళ్ళీ'' మహేష్ బూట్లు విప్పుతూ మాట్లాడుతున్నాడు.

మహేష్ టీపాయ్ మీద పెట్టిన బ్రౌన్ కవర్ వంక భయంగా అదోరకంగా చూసింది స్రవంతి. అలాగే చూస్తూ ఉండిపోయింది ఎంతోసేపు. అందులో ఉంది తన జీవితాన్ని ఓ కుదుపు కుదిపి, సాఫీగా సాగుతున్న తన జీవన ప్రయాణాన్ని ఓ మలుపు తిప్పేసిన సంఘటన. తన సమస్య..దానికి మహేష్ జవాబు.. తన భవిష్యత్తు.

''స్రవంతీ..ఏంటా ఆలోచన...అన్నం వడ్డించు'' మహేష్ స్నానం ముగించుకుని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న సంగతి కూడా గ్రహించని స్రవంతి తడబడుతూ లేచి ఇద్దరికీ అన్నం వడ్డిం

## అందం

**చలనచిత్ర రంగంలో పదికాలాలపాటు నిలబడాలంటే కొన్ని పద్ధతులు పాటించాలి. అవి మన ఆహారం పరంగానైనా, వ్యవహార పరంగానైనా అయి ఉంటాయి. 'నేను చాలా అందంగా ఉంటాను. అందుకే నేను చాలా హేపీగా ఉంటాను. సినిమాల్లో అవకాశం కోసం నేను ఇష్టమొచ్చినట్టు వ్యవహరించను. అలాగే షూటింగ్స్‌లో అది కావాలి, ఇది కావాలి అని అడిగి ఎవ్వరినీ ఇబ్బంది పెట్టను' అంటోంది శిల్పాశెట్టి. ఇంతకీ ఈమె ఇలా మాట్లాడడానికి దారితీసిన పరిస్థితులు ఏమై ఉంటాయబ్బా!**

చింది. మహేష్ తన పేషంట్ల గురించి ఏదో చెప్తున్నాడు. స్రవంతి వింటున్నట్టు మధ్య, మధ్య పేలవమైన నవ్వుతో 'ఊ' కొడ్తోందే తప్ప మహేష్ చెప్తున్న దాంట్లో ఒక్క అక్షరమూ స్రవంతి మెదడుని చేరటం లేదు. ఈరోజేకాదు ఓ నెలనుంచీ స్రవంతి మరబొమ్మలా, మెదడులేని మనిషిలా, యాంత్రికంగా జీవిస్తోంది. మరి అది చూసేవాళ్ళకి తెలుస్తోందో లేదో కానీ స్రవంతికి మాత్రం తనలో మార్పు స్పష్టంగా తెలుసు.

''స్రవంతీ...నేను వీటి జవాబులు రాసి పడుకుంటాను. నువ్వు వెళ్ళి పడుకో''

''నాకూ నిద్ర రావటం లేదు..కొత్త మేగజైన్స్ వచ్చాయి. కాస్సేపు చదువుకుంటాను'' స్రవంతి డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు సర్ది..టేబుల్ శుభ్రం చేసి వచ్చి మహేష్ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుని ఓ మేగజైన్ చేతిలోకి తీసుకుంది. పుస్తకం చేతిలో ఉందన్నమాటే కానీ స్రవంతి చూపులన్నీ మహేష్‌నే గమనిస్తున్నాయి. మహేష్ మనస్తత్వ నిపుణుడు.

అందుకే ఓ ప్రముఖ వారపత్రికలో ప్రజల మానసిక సమస్యలకి 'మీ సమస్యలు-మా సమాధానాలు' అన్న శీర్షిక ద్వారా జవాబులు ఇస్తూంటాడు. ప్రతి బుధవారం హాస్పిటల్ నుంచి వస్తూ పత్రిక ఆఫీస్ నుంచి ఉత్తరాలు తెచ్చుకుని తగిన సమాధానాలు రాసి శుక్రవారం మళ్ళీ పత్రిక వాళ్ళకి అందజేస్తూంటాడు. మహేష్ ఒక్కో లెటర్ తీసి చదివి దానికి సమాధానం రాసి పక్కన పెడ్తున్నాడు.

మ్యాగజైన్ కళ్ళముందున్నా ఓరగా మహేష్ తీస్తున్న ఒక్కో లెటర్‌నీ పరిశీలిస్తున్న స్రవంతి కళ్ళు హఠాత్తుగా రెపరెపలాడాయి. అదే..అదే.. నీలి రంగు కవరు. స్రవంతి ఒక్కసారి కాలం స్తంభించిపోయి ఊపిరి ఆడనట్టుగా ఉక్కిరిబిక్కిరి అయింది. ఈ ఉత్తరానికి మహేష్ ఇచ్చే జవాబు-పరిష్కారం ఏమిటి? పేరున్న సైకాలజిస్ట్‌గా, సైకియాట్రిస్ట్‌గా ఎంతో



మందికి సలహాలు ఇచ్చి, వాళ్ళ జీవితాల్లో వెలుగు నింపడానికి ప్రయత్నించే మహేష్ తన సమస్యకి ఇచ్చే పరిష్కారం ఏమిటి? అసలు అది తను రాసింది అని తెలిస్తే ఎలా రియాక్ట్ అవుతాడు. మనుష్యుల మనసుల్ని పుస్తకంలా చదివెయ్యగలను అనుకునే మహేష్ తనలో ఈ నెల్లాళ్ళుగా ఏ మార్పూ గమనించలేదా? గమనించాడో లేదో కానీ మహేష్ కూడా మునుపటిలా లేడు. అతనిలోనూ ఏదో మార్పు ఉంది. అందుకే నెలరోజులగానే తమ మధ్య తమకి తెలియకుండా దూరం ఏర్పడింది. మహేష్ పాఠకులకి ఇచ్చే సమాధానాలు వారం వారం తను చదువుతుంది. పాజిటివ్‌గా ఆలోచిస్తూ గతాన్ని పాతిపెట్టి ధైర్యంగా ముందుకు అడుగెయ్యమని అందరికీ సమాధానమిస్తాడు. వాళ్ళకి ఇచ్చే స్వాంతన..చూపిన సానుభూతి..ఆ సమస్య మరెవరిదో కాదు తనకి కూడా సంబంధించినది అని తెలిసినప్పుడు ఎలా స్పందిస్తాడు.

''ఈమధ్య ఇలాంటి సమస్యలు ఎక్కువైపోతున్నాయి. ఈవిడెవరో చూడు..బాస్‌తో టూర్ వెళ్ళినప్పుడు అనుకోని పరిస్థితుల్లో వాళ్ళు ఇద్దరూ ఏ దురుద్దేశ్యం లేకుండానే ఒకటయ్యారుట. కావాలని తప్పు చెయ్యకపోయినా భర్తకి ద్రోహం జరిగిందని కుమిలిపోతోంది. మనశ్శాంతి కరువైందట. భర్తకి నిజం చెప్పి అతని నుంచి దూరంగా వెళ్ళి ఒంటరిగా బతకాలని ఉందిట. ఎలా జరిగినా..ఎలాంటి పరిస్థితుల్లో జరిగినా జరిగిన తప్పు నన్ను నేను క్షమించుకోలేనంత కృంగదీస్తోంది ఏం చెయ్యను అంటోంది..'' మహేష్‌కి అప్పుడప్పుడు కొన్ని ఉత్తరాలు చదివి వినిపించి వాటి గురించి స్రవంతితో చర్చించడం అలవాటే.

''ఎలా జరిగినా తప్పు తప్పే మరి..ఆవిడ కృంగిపోవడంలో ఆశ్చర్యం లేదు'' స్రవంతికి ఒళ్ళంతా ముచ్చెమటలు పోస్తున్నాయి. వాతావరణం చల్లగానే ఉన్నా. పైట కొంగుతో తన ఆదుర్దాని కప్పిపుచ్చుకోవడానికి మొహమంతా తుడుచుకుంటూ మహేష్ వైపు చూసింది.

''పవిత్రత మనసుకి సంబంధించింది. అనుకోని పరిస్థితుల్లో కావాలని అనుకోకుండా జరిగినప్పుడు పండంటి సంసారం పాడు చేసుకోవడం ఏం సమంజసం''

''భర్తతో నిజం దాచి మునుపటిలాగే ప్రవర్తించడానికి మనస్సాక్షి ఒప్పుకోవాలిగా..''

''మనస్సాక్షి సంగతి వదిలెయ్యి..పిల్లలున్నారేమో..వాళ్ళ..''

''ఉన్నారు. ఐమీన్ ఉండే ఉంటారు. పదహా

రేళ్ళ వైవాహిక జీవితంలో పిల్లలు ఉండకుండా ఉండరు'' స్రవంతి తడబడుతూ అంది.

''అంటే వాళ్ళు టీనేజ్‌లో ఉంటారు. అలాంటప్పుడు నీకు ద్రోహం జరిగింది. ఇంట్లోంచి పోతాను అంటే దాని ప్రభావం పిల్లల మీద పడుతుంది''

''అయితే ఈవిడ ఏం చెయ్యాలంటారు''

''పవిత్రత మనసుకే.. ఒంటికి కాదు. అదీ విపరీత పరిస్థితుల్లో ఇద్దరి ప్రమేయం, అనుమతీ లేకుండా జరిగిపోయిన తప్పు తప్పుకాదు.. పిల్లల భవిష్యత్తునీ, కుటుంబాన్నీ దృష్టిలో పెట్టుకుని నిజం దాచి మునుపటిలానే జీవితాన్ని గడపడం ఆ కుటుంబానికి శ్రేయస్కరం'' మహేష్ ఎంతో తేలిక- దీని పరిష్కారం అన్నట్టు చెప్పాడు.

స్రవంతి పేలవంగా నవ్వింది. ''ఎదుటివాళ్ళ సమస్య మనకెప్పుడూ చాలా చిన్నదిగా అర్థవిహీనంగా కన్పిస్తుంది.. ఇలాంటి సమస్య ఒకవేళ మనకే ఎదురైతే..''

మహేష్ హఠాత్తుగా పకపకా నవ్వడం మొదలుపెట్టాడు. ''ఒకవేళ ఈ ఉత్తరం నువ్వే రాశావు అనుకో.. జస్ట్ అనుకో.. అయినా నా సమాధానం ఇదే.. బైదిబై మన పెళ్ళయి పదహారేళ్ళు కాలేదు'' మహేష్ తన జోక్‌కి తనే మురిసిపోతున్నట్టు గట్టిగా నవ్వుతూనే ఆ సమస్యకి సమాధానం రాసి పక్కన పెట్టాడు.

''నాకు నిద్రవస్తోంది. నేను పడుకుంటాను'' స్రవంతి లేచి బెడ్రూమ్ వైపునడిచింది. పడుకుందన్న మాటేగానీ నిద్రాదేవి స్రవంతిని కరుణించటం లేదు.. ఈ రోజే కాదు నెల రోజులుగా.

★ ★ ★

మారుతి వ్యాన్‌కి చెరో వైపున్న కిటికీలోంచి స్రవంతి, శ్రీధర్ ఆకాశంలోకి శూన్యదృక్కులతో చూస్తున్నారు. ఇద్దరిలోనూ అపనమ్మకం-షాక్ లోంచి ముందుగా శ్రీధర్ తేరుకున్నాడు.

''స్రవంతీ జరిగింది కేవలం యాదృచ్ఛికం.. దీన్ని నేనెప్పుడూ గుర్తు చేసుకోను. మీరూ మీ మస్తిష్కంలోంచి దీన్ని చెరిపెయ్యండి. ప్లీజ్.. మన జీవితాలు అల్లకల్లోలం కాకుండా ఉండాలంటే దీన్నో పీడకలగా మర్చిపోవాలి'' స్రవంతి మాట్లాడలేదు. శూన్యంలోకి అలాగే చూస్తోండిపోయింది. ఇది పీడకలే.. తమిద్దరి మధ్యా ఏనాడూ ఆకర్షణ.. వ్యామోహం లేవు. ఒకరిమీద ఒకరికి కొలీగ్ అన్న గౌరవం, సద్భావం తప్ప మరో ఆలోచనే లేదు. కానీ జరిగింది.

ఆరోజు డెలిగేట్స్ అందరూ పూనే నుంచి లోనావాలా సైట్ సీయింగ్‌కి బయలుదేరారు. అంతకుముందే చాలా సార్లు చూసి ఉండడంతో శ్రీధర్, స్రవంతి కాస్సేపు డెలిగేట్స్‌తో తిరిగి పూనే వెనక్కి వెళ్ళిపోవడానికి మారుతీ వ్యాన్‌లో తిరుగుప్రయాణం మొదలుపెట్టారు.

అంతవరకూ నిర్మలంగా నిశ్శబ్దంగా ఉన్న ప్రకృతి ఒక్కసారిగా బీభత్సంగా మారిపోయింది. జడివాన. అయిదు గంటలకే అంధకారం నలుమూలలా పరుచుకుంది. గమ్యానికి చేరువయ్యాం అనుకుంటుండగానే వ్యాన్ కదలనని మొరాయించింది. వ్యాన్ విండో తలుపులు తెరిస్తే లోపలికి చొచ్చుకుని తడిపేస్తున్న వాన. అద్దాలు మూస్తే గాలి స్తంభించి ఉక్కిరిబిక్కిరిగా ఉక్కపోత. శ్రీధర్, స్రవంతి దట్టంగా పరుచుకున్న మర్రిచెట్టు నీడలోకి చేరి అటువైపుగా వచ్చే ఏదైనా వెహికిల్ ఆపి సహాయం అడగాలి అనుకుంటుండగా.. ఎక్కడి నుంచి వచ్చాడో అతను.. మాసిన బట్టలు, చింపిరి గడ్డం.. బహుశా మరాఠీలో కాబోలు ఏదో అంటూ వాళ్ళ మీదకి దూసుకువచ్చాడు.

దొంగా? పిచ్చివాడా?

శ్రీధర్, స్రవంతి అతన్ని వదుల్చుకోవడానికి మళ్ళీ వ్యాన్‌లోకి ఎక్కి అన్ని డోర్స్, కిటికీలు మూసుకున్నారు. శ్రీధర్ స్రవంతిని వదిలి ముందు సీట్లో కూర్చోవడానికి లేచినా భయంతో శ్రీధర్‌ని కదలనివ్వలేదు స్రవంతి. పిచ్చివాడు కారు చుట్టూ తిరుగుతూ కర్రతో చిన్న రాళ్ళతో అద్దాల మీద కొడ్తున్నాడు. అంధకారం, భయం, తడిబట్టలు ప్రకృతి పురుషుల సాన్నిధ్యం అలాంటి సమయాల్లో ఎలా స్పందిస్తారో అలాగే జరిగింది. భయం స్రవంతి, శ్రీధర్‌లని ఒకటి చేసింది. ఆ సమయంలో ఇంకేదీ గుర్తు రాలేదు. ఆ భయాన్ని ఒంటరితనాన్నీ జయించడానికి వాళ్ళు ఏ ఉద్దేశ్యం లేకుండానే ఒకటిగా మారిపోయారు. శ్రీధర్, స్రవంతీ ఈ లోకంలోకి వచ్చి తిరిగి చూసేటప్పటికి పిచ్చివాడు ఆ చుట్టుపక్కల లేడు. ఓ కిటికీ అద్దం మాత్రం పగిలింది. 'పగిలింది అద్దం మాత్రమే కాదు నా జీవితం కూడా. తప్పు ఎలా జరిగినా శ్రీధర్‌ని తను తప్పుపట్టలేదు కూడా. అతన్ని బల్లిలా కరుచుకుపోయింది తనే..' స్రవంతి తనలో తనే రగిలిపోయింది.

శ్రీధర్ ఆ సంఘటన జరగలేదు అన్నట్టు ఆఫీస్‌లో, బయటా ఎంతో మామూలుగా, హుందాగా ప్రవర్తిస్తున్నా స్రవంతి మాత్రం స్త్రీగా భర్తకి ద్రోహం చేశానన్న తలంపుతో, శీలం కోల్పోయానన్న హీనభావంతో కుమిలిపోతోంది.

అందుకే పరిష్కారం చూపించమంటూ తన భర్తకే ఆ ఉత్తరం.. నిజంగా ఆ సమస్య తనదే అని తెలిసినా మహేష్ అదే సమాధానం ఇచ్చేవాడా? మహేష్‌కి తనంటే ప్రాణం. ''నువ్వు నా ఒక్కడికే స్వంతం.. మరో మగపురుగు పది నిమిషాలు ఆరాధనగా చూసినా సహించలేను'' అనే మహేష్- ఆ ఉత్తరం రాసింది తనే అని తెలిస్తే క్షమించగలడా? తనతో నిజంగానే ప్రేమగా ఉండగలడా? స్రవంతి ఆలోచనా స్రవంతిలో కొట్టుకుపోతూ చివరికి తీరం చేరినట్టు నిద్రలోకి జారుకుంది.

మహేష్ నిద్రపోతున్న స్రవంతి మోహాన్ని బెడ్‌లైట్ వెలుతురులో తదేకంగా చూస్తున్నాడు. ''స్రవంతీ ఆ ఉత్తరం రాసింది నువ్వే అని నాకు తెలుసు. నువ్వెంత వంకర టింకరగా అక్షరాలు రాసినా నువ్వు 'క' అక్షరం రాసే తీరు నిన్ను పట్టిచ్చింది. కవర్‌మీద ఎడ్రస్ రాసేటప్పుడు నువ్వు రాత మార్చాలనుకోకపోవడం దాన్ని నిర్ధారించింది. నెల్లాళ్ళుగా నువ్వు టూర్ నుంచి వచ్చినప్పటినుంచీ నీలో మార్పు నేను గమనించాను. ఏదో జరిగిందని అర్థమైనా ఏం జరిగిందో పూర్తిగా ఊహించలేక నువ్వు దూరంగా ఉంటుంటే నేనూ దూరాన్ని చెరిపే ప్రయత్నం చేయకుండా ఉండిపోయాను. సలహాలు ఒకరికి ఇవ్వడానికి అదే సమస్య మనకెదురైతే ప్రవర్తించే తీరుకీ ఎంతో తేడా ఉంటుంది. నిజం తెలిసినా నీలో వేరే దురుద్దేశ్యం లేని పరిస్థితుల్లో తప్పు జరిగిందని తెలిసినా నేను రాసిన సమాధానం నన్ను సమాధాన పరచలేకపోతోంది. పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు అడుగెయ్యాలని అందరికీ సలహాలిచ్చే నేను, నాలో ఉన్న నెగటివ్ కోణాన్ని అధిగమించలేకపోతున్నాను. అందుకే ఈ నెల రోజులుగా నావైపు నుంచి కూడా మనమధ్య దూరం పెరగడానికి అవకాశం కలిగింది. నేనిచ్చే సమాధానాల ఎత్తుకు ఎదగడానికి ప్రయత్నిస్తున్నాను స్రవంతీ. మన మధ్య ఉన్న ఈ దూరం త్వరలోనే కరిగిపోయేందుకు నా వంతు ప్రయత్నం నేను చేస్తాను. ప్లీజ్ నువ్వూ పాత స్రవంతిగా తిరిగి నా జీవితంలోకి రా..'' పక్కన ఒత్తిగిల్లి స్రవంతి భుజం మీద చెయ్యి వేసి దగ్గరికి జరిగిన మహేష్ కళ్ళల్లో రాజీపడ్డున్నందుకో... సమస్య దూరం అవుతోంది అనిపించినందుకో.. తెలియని కన్నీళ్ళు.

☆

